తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మహిళా వర్సిటీకి
# మరో మణిహారం

-ఖేలో ఇండియా మల్టీ పర్పస్ ఇండోర్ హాల్
-తిరుపతి ఎంపీ కృషితో 4.50కోట్లు మంజూరుతో నిర్మాణం
-ఆధునిక హంగులతో ఇండోర్ స్పోర్ట్స్, జిమ్నాస్టిక్ హాల్
-నేడు మంత్రి లోకేష్ ప్రారంభం



తిరుపతి విద్య ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

పద్మావతి మహిళా వర్సిటీ శిగలో మరో మణిహారం వచ్చిచేరింది.ఎంతో కాలంగా విద్యార్థులు ఎదురు చూస్తున్న ఇండోర్ స్పోర్ట్స్ కోసం మల్టీ పర్పస్ ఇండో హాల్ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.మహిళలు అకడమిక్ విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలనే ఉద్దేశంలో ఖేలో ఇండియా స్కీమ్ లో భాగంగా రూ.5.72కోట్లతో మంజూరైన మల్టీ పర్పస్ ఇండోర్ హాల్తో ఎంతో మంది మహిళా క్రీడాకారులు తయారై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు దోహదపడుతుందని వర్సిటీ అధికారులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

**-అత్యాధునిక హంగులతో....**

పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్మించిన మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలో నాలుగు షెటిల్ బ్యాడ్మింటన్ కోర్డులు, ఒక హ్యాండ్ బాల్ కోర్టు, జిమ్నాస్టిక్ హాల్,టేబుల్ టెన్నిస్ హాల్,జూడో మ్యాట్, వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడలకు సౌలభ్యంగా భవననిర్మాణాన్ని పూర్తి చుశారు.ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.4.50కోట్లు ఉండగా మహిళా వర్సిటీ రూ.1.22కోట్లు సమకూర్చింది. ఇందులో విద్యార్థినులను క్రీడలవైపు ప్రోత్సహించేందుకు అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేయనున్నారు.

**-తిరుపతి ఎంపీ కృషితోనే...**

తిరుపతి ఎంపీ ఎం గురుమూర్తి కృషితో ఖేల్ ఇండియా స్కీమ్ ద్వారా మహిళా వర్సిటీలో మల్టీపర్పస్ ఇండోర్ హాల్ మంజూరైంది. ఇండోర్ హాల్ వర్సిటీలో ఏర్పాటు చేయాలని గతంలో పలు మార్లు వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థినులు ఎంపీకి విన్నవించారు. దీంతో 2021లో కేంద్ర ప్రభుత్వానికి పలు మార్లు ఆయన మహిళా వర్సిటీలో విద్యార్థినులకు ఇండోర్ హాల్ ఆవశ్యకతను తెలియజేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఎంపీ విన్నపం మేరకు రూ.4.50కోట్లు మంజూరు చేసింది. ఇందుకోసం ఆయన పలు మార్లు వర్సిటీ అధికారులను సంప్రదించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించారు.

**-నేడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభం**

మహిళా వర్సిటీలో మల్టీపర్పస్ ఇండోర్ హాల్ను బుధవారం విద్యా, ఐటీ శాఖ మంత్రి నారాలోకేష్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే వర్సిటీలో అన్ని ఏర్పాట్లు వర్సిటీ వీసీ, అధికారులు, పోలీసులు పూర్తి చేశారు. ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఇండోర్ హాల్ వద్ద సుందరీకరణ పనులను మంగళవారం అధికారులు శరవేగంగా పూర్తి చేశారు.

## కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి(రవాణ),ఫిబ్రవరి 18ప్రభాతవార్త:



తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరునికి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యాయి. నేడు ధ్వజారోహణం జరగనుంది. ఈనెల 28వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు కన్నులపండుగా జరుగుతాయి.



## వైసిపి స్వతంత్రులు మద్దతు సరే!
# కౌన్సిల్‌లో ఎవరి బలం ఏంటో తేలేదెన్నడో?

**ప్రభాతవార్త-తిరుపతి:**

జగమంతకుటుంబం నాదీ...ఏకాకి జీవితం నాదీ! అనే రీతిలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో కొత్తగా ఎన్నికైన డిప్యూటీ మేయర్ పరిస్థితి మారిందనే చర్చ మొదలైంది. నాలుగేళ్ళపాటు ఒకే ఒక్కడుగా ప్రజల సమస్యలపై గొంతెత్తినా, కౌన్సిల్‌లో పట్టున్న వైసిపి కార్పొరేటర్ల బలగంతో (47మంది) పోరాటం చేసినా చివరకు ఆయన ఒక్కడే అన్నట్లుగా మిగిలాడు. అనూహ్యరీతిలో ఈనెల 4వ తేదీ జరిగిన రెండవ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో రెబల్‌గా మారిన కొందరు వైసిపి కార్పొరేటర్లు కూటమి పార్టీ పంచన (బయటినుండే)చేరి ఒక్కడికి మద్ధతుగా నిలిచారు. 25ఓట్లతో ఒకేఒక్క టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ డిప్యూటీ మేయర్ కుర్చీ అందుకున్నాడు. అంతవరకు బాగానే ఉన్నా ఇప్పుడే కౌన్సిల్‌లో అసలు ట్విస్ట్ మొదలైంది. ఆయన ప్రమాణస్వీకారం చేయడానికి ముందే కొందరు వైసిపి కార్పొరేటర్లు ఇప్పటికే (10మంది వరకు) స్వతంత్రులుగా వ్యవహరిస్తున్నామని చెబుతున్న వాళ్ళంతా ఆ పార్టీ నుండి బయటకు రావాలి. లేదా పార్టీ గుర్తుపై గెలిచిన వాళ్ళంతా ఇప్పుడు రాజీనామా చేయాలనే వాదన వైపిసి నేతలు వినిపిస్తున్నారు. పార్టీతోనే అంటిపెట్టుకుని ఉన్న 21మంది కార్పొరేటర్లు బలంగానే ఉన్నారు. మరీ కూటమిపంచన చేరిన వారిని సస్పెన్షన్ చేసినా, రాజీనామాకుపట్టుబట్టినా ఈ పరిస్థితుల్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ రద్దవడం, ఆ తరువాత ఆరునెలలకు తాజాగా ఎన్నికలు జరగాల్సి ఉంది.కానీ పదవుల పందేరంలో ముందుగానే కుదర్చుకున్న ఒప్పందంతో వైసిపి కార్పొరేటర్లు ఏకంగా మేయర్ కుర్చీపైనే కన్నేసి ప్రాకులాడుతుండటం మరీ విశేషం. ప్రస్తుతం నెలకొన్న రాజకీయస్తబ్ధతలో 25మంది వైసిపి కార్పొరేటర్లలో ఇప్పటికే ఐదుమంది ఆ పార్టీనుండి బహిష్కృతులయ్యారు. కూటమితో ఉన్న 20మందిలో కొందరు కార్పొరేటర్లు తమ తప్పిదమంటూ ఆ పార్టీనేతలతో మొరపెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉన్న పదవీ కాలంలో అయినా జనంలో కార్పొరేటర్లగానే మిగిలిపోవాలనే ఆశలు వీడలేదనేది గుప్పుమంటోంది. ఈ నేపథ్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ కథ ఎంతవరకు సాఫీగా నడుస్తుందనేది మాత్రం పెద్దట్విస్ట్‌నెలకొంది. సోమవారం తిరుపతికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జిల్లా ఇన్‌చార్జిమంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసేందుకు ప్రయత్నాలు చేసినా కార్పొరేటర్లు కలసిరాలేదనేది కూడా ఇప్పుడు రసవత్తర చర్చకు దారితీస్తోంది. మరీ అటు వైసిపి నేతల ఇటు కూటమిపార్టీల నేతల నిర్ణయం ఏంటనేది మాత్రం అంతుపట్టని విషయంగా మారింది.

# వైభవంగా కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

## శాస్త్రోక్తంగా ధ్వజారోహణం..భక్తులకు మెరుగైన సౌకర్యాలు





చంద్రగిరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:

ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన ధ్వజారోహణం కార్యక్రమంతో శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం ఉదయం 8.20 నుండి 8.40 గంటల మధ్యన మీనలగ్నంలో ధ్వజారోహణం వైదిక క్రతువు ఆగమోక్తంగా జరిపించారు. ఈ కార్యక్రమానికి జెఈఓ వీరబ్రహ్మం దంపతులు హాజరై ధ్వజారోహణ క్రతువులో పాలుపంచుకున్నారు. ఇందులో భాగంగా ఉదయం గంటలకు స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుచ్చి వాహనం విహరిస్తూ ఆలయ ఆవరణలోని ధ్వజస్థంభం వద్దకు చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు మాట్లాడుతూ విష్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ట, రక్షా బంధనం చేపట్టారు. వైఖానస ఆగమోక్తంగా గరుత్మంతుడిని నూతన వస్త్రంపై లిఖించి ప్రత్యేక పూజలతో ధ్వజస్థంభంపై ప్రతిష్టించారు. 18 గణాల ముక్కోటి దేవతలను అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడమే ధ్వజారోహణ ఘట్టం ముఖ్య లక్ష్యమని వివరించారు.

**పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడు**

మొదట రోజు రాత్రి దేవదేవుడు పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సర్వాంతర్యామి అయిన శ్రీనివాసుడు పెద్దశేష వాహనంపై విహరిస్తూ లోకరక్షకుడుగా ప్రజల ఈతిభాధలను తొలగించి మోక్షమార్గం ప్రసాధిస్తూ తిరుమాడవీధులలో ఊరేగారు. ఈ వాహన సేవలో గజ, అశ్వదళ, నంధీ సమేత కోలాటాల కోలాహలం నడుమ భక్తులు గోవిందనామస్మరణలతో శ్రీనివాసుడిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలలో భక్తుల రద్దీకి తగిన రీతిన ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్లు వలిశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్ స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్ తమ సిబ్బందితో సమర్ధవంతంగా ఏర్పాట్లు చేశారు.

## పదో తరగతి పరీక్షలకు
# పూర్తి ఏర్పాట్లు!

- మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు
- జిల్లాలో 164 కేంద్రాల్లో హాజరు కానున్న 28,656 మంది విద్యార్థులు
-మాస్ కాపీయింగ్‌కు చోటు లేదు.. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :

జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ డీఆర్‌వో నరసింహులు, డీఈవో కె.వి.ఎన్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 17 నుంచి 31వ తేది వరకు పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా పత్రాలు భద్ర పరిచే కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మార్చి 17 నుంచి 31వ తేది వరకు రెగ్యులర్, 17 నుంచి మార్చి 28 వరకు ఓపెన్ స్కూల్స్ విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. రెగ్యులర్, ప్రైవేట్ కలిపి జిల్లాలో 164 కేంద్రాల్లో 28656 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఓపెన్ స్కూల్స్ పదవతరగతి చదువుతున్న 1019 మంది విద్యార్థులకు గానూ 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయమని తెలిపారు. ఓపెన్ స్కూల్స్ పదవ తరగతి పరీక్షలు మార్చి 17వ తేది నుంచి 28వ తేది వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. మూడ్లు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీయట్ మార్చి 3వ తేది నుంచి 15వ తేది వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. ఇంటర్మీయట్ చదువు తున్న 2838 విద్యార్థులకు గాను 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రవాణా, కరెంటు, మెడికల్ సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ, విద్యుత్, మెడికల్ అధికారులను ఆదేశించారు. మాస్ కాపింగ్ జరగకుండా ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను, డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారని, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, జిరాక్స్, నెట్ సెంటర్లను మూసివేయాలని తెలిపారు. 10 రూట్‌లను ఏర్పాటు చేసి రూట్ ఆఫీసర్లును నియమించాలన్నారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ గురుస్వామిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్, డెప్యూటీ ఈవో బాలాజీ, జిల్లా రవాణాశాఖాధికారి మురళీ మోహన్, డీపీవో సుశీలాదేవి, పోలీస్, విద్యుత్, పోస్టల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్య సేవలో
# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:

ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేభమందిరంలో మంగళవారం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా సేవలు అందించే ఆరోగ్యమిత్రలతో కలెక్టర్ సుమిత్‌కుమార్ సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సిలు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా రోగులకు వైద్య సేవలు అందించడంలో ఆరోగ్యమిత్రలు పూర్తి సహాయ సహకారం అందించి వారికి తోడ్పాటు అందించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా వైద్య సేవ పొందడానికి వచ్చే పేషెంట్ల నుండి సంబంధిత యాజమాన్యాలు నగదు రహిత వైద్యం అందించేలా ఆరోగ్యమిత్రలు చర్యలు తీసుకోవాలన్నారు. నగదు రహిత వైద్యం పొంది ఆసుపత్రి నుండి డిశార్చి అయిన పేషెంట్ల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడానికి సంబంధిత ఎఎన్ఎంలకు సమాచారం అందించి వారి వారి సమాచారంను యాప్ నందు అప్‌లోడ్ చేసేలా ఆరోగ్య మిత్రలు సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలన్నారు.

# ఏడు నెలలుగా...వేతన వెతలే...!

**ఏ నెలలోనూ ఒకటో తారీఖు జీతాలు ఇవ్వలేదు**
**ఎస్వీయూలో శాశ్వత ఉద్యోగులు, పెన్షనర్ల ఆవేదన**
**నేటి సాయంత్రం వరకు గడువు ఇచ్చిన ఉద్యోగులు**
**లేని పక్షంలో రేపటి నుంచి నిరసనలకు పిలుపు**
**నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏడీ బిల్డింగ్ వద్ద నిరసన**



తిరుపతి విద్య, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :

ఎస్వీయూలో వేతన జీవుల సహనం నశించింది. జీతాలు సక్రమంగా చెల్లించక పోవడంతో ఆగ్రహ జ్వాలలు తారా స్థాయికి చేరుకున్నాయి. దీంతో పిడికిలి బిగించి కదం తొక్కనున్నారు. గత ఏడు నెలుగా ఏ నెలలోనూ ఒకటో తారీఖున జీతాలు అందక పోవడంతో వేచి చూసిన ఉద్యోగులు జనవరి మాసం జీతాలు ఇంత వరకు అందక పోవడంపై పలు మార్లు అధికారులకు ప్రభుత్వానికి విన్నవించారు. అధికారులు నుంచి సరైన స్పందన లేక పోవడంతో పోరుబాటలో నడిచేందుకు సన్నద్ధమవుతున్నారు.

**ఒకటో తారీఖు హామీ ఏమైందో...!**

శాశ్వత ఉద్యోగులకు ఒకటో తారీఖున వేతనాలు అందించి తీరుతామని ప్రగల్బాలు పలికిన కూటమి ప్రభుత్వ మాట నిలుపుకోలేక పోయింది. జీతాలు ఒకటో తారీఖున ఇవ్వలేమని చేతులేత్తేసింది. వర్సిటీలో గత ఏడు నెలుగా ఏ రోజు సక్రమంగా చెల్లించిన దాఖలాలు లేవు. కూటమి నాయకులు ఎన్నికల ముందు ఉద్యోగులను మభ్యపెట్టి ఒట్లను దండుకుని అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కి ఉద్యోగులు కడుపుకొడుతున్నారని వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చకు తెరతీశారు.

**రేపటి నుంచి నిరవధిక నిరసనలకు పిలుపు**

ఎస్వీయూలో ఉద్యోగులు పోరుబాటకు పిలుపునిచ్చారు. వేతనాల వెతలతో కుటుంబాలను పోషించలేని స్థితి ఏర్పడిందని ప్రతి ఉద్యోగి వర్సిటీలో వేతనాలు సక్రమంగా అందక పోవడంతో దుర్భర స్థితిలో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈఎంఐలు, క్రెడిట్ కార్డుల చెల్లింపు, లోన్ బకాయిలు ఇంటి అద్దె, స్కూల్ ఫీజులు, నిత్యవసర అవస్థలతో దిక్కుతోచని స్థితిలో ఉద్యోగులు పెన్షనర్లు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. దీంతో బుధవారం సాయంత్రంలోపు జీతాలు నిజము కాకుంటే గురువారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు పోరుబాటు కొనసాగించనున్నారు.

## వావిల్ తోట ఉన్నత పాఠశాలకు
# వసతులు కరువు

**- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు - అవస్థలు పడుతున్న విద్యార్థులు**




*పూతలపట్టు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త*

*ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పూతలపట్టు మండలం వావిల్ తోటలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గత కొన్ని సంవత్సరాలుగా మహాద్వారం గేటు ప్రహరీ గోడ వంటి వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వావిల్ తోటలో ఉన్నత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల 2001 - 2002 సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలని స్థాపించారు. పాఠశాల స్థాపించి 24 సంవత్సరాలు గడుస్తున్నా మౌలిక వసతులు లేకపోవడం చేత చుట్టు పక్కల ఉన్న విద్యార్థిని, విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకోవడానికి మొగ్గు చూపకుండా ప్రైవేట్ పాఠశాలను ఆచరిస్తున్నారు. దీనితో ఏడాది ఏడాదికి విద్యార్థులు సంఖ్య తగ్గుతుంది అయినా కూడా ప్రధానోపాధ్యాయులతో పాటు మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలకు మౌళిక సదుపాయాలు కల్పించి పాఠశాల అభివృద్ధి కృషి చేయకపోవడం చేత కనీసం వసతులు నోచుకోవడం శోచనీయం. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అభివృద్ధి నిమిత్తం నిధులు కేటాయిస్తున్నారు. అయితే మండల విద్యాశాఖ అధికారులు పాఠశాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుండి 10వ తరగతి వరకు సుమారు 80 మంది విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు సరైన వసతులు లేకపోవడం చేత టిసి తీసుకోని ప్రైవేటు పాఠశాలలో చేరుతున్నారు. ఉన్నత పాఠశాలలో మహా ద్వారము గేటు, ప్రహరీ గోడ లేకపోవడం చేత బాలికలకు భద్రత కరువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వావిల్ తోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మెరుగైన వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.*

## నక్ష కార్యక్రమాన్ని
# పారదర్శకంగా చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్**

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం ద్వారా నక్ష కార్యక్రమం తిరుపతి ఎంపికైన నేపథ్యంలో పట్టణంలో సర్వే ప్రక్రియ ద్వారా పారదర్శకంగా లోపాలు లేని భూ రికార్డులు తయారయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో కేంద్ర ప్రభుత్వం కార్యక్రమం నక్ష సర్వే పై వర్క్ షాప్‌ను జిల్లా కలెక్టర్, ఎంపి గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్‌లు ముద్ర నారాయణ, ఆర్‌సి మునికృష్ణ, కార్పొరేటర్ అనిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నక్షా భారత ప్రభుత్వ మార్గ నిర్దేశాల మేరకు చేపట్టడం జరుగుతుందని ఈ సర్వే ద్వారా తిరుపతి పట్టణంలోని పలు భూ సంబంధిత రికార్డులు పూర్తిస్థాయిలో పక్కాగ లోపాలు లేనివిగా తయారవ్వాలని సూచించారు. దేశంలోని 150 సిటీలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి వీటిలో నక్ష అనే ప్రోగ్రాం కింద సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సుబ్రమణ్యంలు మాట్లాడుతూ తగాదాలు లేని పక్కాగా ఉండే రికార్డులు తయారయ్యేలా నక్షా ప్రోగ్రాం నిష్పాక్ష పాతంగా సర్వే చేపట్టాలన్నారు. తిరుపతి మున్సిపాలిటీ అదనపు కమిషనర్ చరణ్ తేజ్, ఉప కమిషనర్ అమరయ్య, సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ సర్వేయర్ దేబ బ్రత పాలిత్, జిల్లా భూరికార్డుల అధికారి అరుణ్ కుమార్, డిసిపి మాహా పాత్ర, తహశీల్దార్ అర్బన్ భాగ్యలక్ష్మి, వార్డు ఎమినీటీస్, అడ్మిన్, ప్లానింగ్ సెక్రెటరీలు పాల్గొన్నారు.




## శాంతి సంక్షేమాలకు దూరంలో జగన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



శాంతి సంక్షేమం అభివృద్ధి అనే వాటికి ఆమడదూరంలో ఉంటూ దాడులు, దౌర్జన్యాలకు గట్టిమద్దతుదారుగా నిలిచే వ్యక్తి మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అని తెలుగుదేశంపార్టీ బిసి విభాగం నాయకులు ఆరోపించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశం కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజా ఉద్యమాలు, పోరాటాలు చేసి వారికంటే అతికిరాతకంగా మారిన వ్యక్తి జగన్‌రెడ్డి ఒక్కరే అని ఎద్దేవాచేశారు. దళిత యువకుడు సత్యవర్ధన్‌ను వంశీ ఎందుకు కిడ్నాప్ చేశాడు? వంశీ నిజంగా తప్పు చేయకపోతే సత్యవర్ధన్‌ను ఎందుకు బెదిరించాడు? ఏతప్పు చేయకపోతే గన్నవరం పార్టీ కార్యాలయంపై దాడి చేయించించి తానే అని వంశీ ఎందుకు ఒప్పుకున్నాడో ఒక్కసారి మాజీ సిఎం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వన్నెకులక్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్‌రవి, తెలుగుదేశంపార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, మునిరాజయాదవ్, నాయిబ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్‌మీడియా కన్వీనర్ కోటచంద్రశేఖర్, మణి, కుమార్, శివ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇమాం,మౌజనులకు వేతానాలు విడుదల హర్షణీయం

.శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్,మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌లకు శ్రీకాలహస్తి ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డిలకు రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షాకిర్ అలీ ముస్లిం సోదరుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఇమామ్ మౌజన్‌లకు ప్రతినెల గౌరవవేతనం నెలకు ఇమామ్‌లకు 10వేలు, మౌజనులకు రూ.5వేలు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. 2024-25 ఏడాదికి గాను రూ.45కోట్లు మంజూరు చేస్తూ సోమ వారం ఉత్తర్వులు జారీచేసినట్లు షాకిరాలీ వివరించారు. మరెన్నో సంక్షేమపథకాలు ఇచ్చేందుకు సిఎం సుముఖంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇమామ్, మౌజన్‌లు దరఖాస్తు చేసుకుని మసీదులు ఉంటే వక్స్‌బోర్డు ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం ఇచ్చారని తెలిపారు.

## శ్రీవారిమెట్టులో గుండెపోటుతో భక్తుడు మృతి

చంద్రగిరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు కాలినడకన వెళుతున్న శ్రీవారి భక్తుడు వెంకటేష్ (50) గుండెపోటుకు గురై మృతి చెందిన విచారకర దుర్ఘటన బుధవారం చోటుచేసుకున్నది. రంగారెడ్డి జిల్లా, షాద్ నగర్‌కు చెందిన వెంకటేష్ తన స్నేహితులతో కలసి తిరుమలకు బయలుదేరారు. శ్రీనివాస మంగాపురం, శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు బయలుదేరారు. 1200 మెట్టు వద్ద తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. దీంతో ఆయనను చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ పరీక్షించి వెంకటేష్‌ను అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. భగవంతుడి దర్శనం కోసం వచ్చి తిరిగిరాని లోకాలకు చేరుకున్న తమ స్నేహితుడి మృతి పట్ల తీవ్రవేదనకు లోనయ్యారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యపానం సేవించడం నిషేధం

చంద్రగిరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరమని డిఎస్పీ ప్రసాద్ హెచ్చరించారు. తహశీల్దార్ శివరామ సుబ్బయ్య, సిఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ రవీంద్రనాథ్‌తో కలసి ఆయన బుధవారం పలుప్రదేశాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో మద్యం బాటిళ్ళు, వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్ళతో నిండిపోయిన ప్రదేశాలను శుభ్రం చేయించి పోలీసు హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పోలీస్ హెచ్చరికలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## స్వర్ణ నారావారిపల్లి లక్ష్యంగా టైలరింగ్‌లో శిక్షణ

చంద్రగిరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు స్వర్ణ నారావారిపల్లి లక్ష్యంగా మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంకల్ప్ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జనశిక్షణ సంస్థ పర్యవేక్షణలో బుధవారం రెండు బ్యాచ్‌లు 50 మందికి శిక్షణ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సప్తగిరి గ్రామీ బ్యాంక్ మేనేజర్ రేణుక, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఒక కుటుంబం ఒక వ్యవస్థాపకుడు సంకల్పంతో జీవనోపాధిని మెరుగుపరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనశిక్షణ సంస్థానం పిడి మోహన్, డిఆర్‌డిఎ సిబ్బంది,ఎపిఎస్ఎస్డిసి సిబ్బంది సునేష, జెఎస్ఎస్ సిబ్బంది హరి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## దామినేడు భూములపై యాజమాన్య హక్కులను పునరుద్ధరించండి

-ఇండ్ల స్థలాలకు నిషేధిత జాబితా నుండి తొలగించాలి

-దామినేడు ప్లాట్స్, అండ్ హౌసెస్ సంక్షేమ సంఘం డిమాండ్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి18 ప్రభాతవార్త:



దామినేడు భూములు, ఇండ్ల స్థలాలను నిషేధిత జాభితా నుండి తొలగించి, యాజమాన్య హక్కులను పునరుద్దరించాలని దామినేడు ప్లాట్స్, హౌసెస్ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. తమ భూములు, ఇండ్ల ప్లాట్స్‌ను 22(ఎ) నిషేధిత జాభితా నుండి తొలగించాలని తిరుపతిరూరల్ తహశీల్థార్ రామాంజులనాయక్‌ను కోరారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం బయట నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దామినేడు ప్లాట్ అసోసియేషన్ అధ్యక్షులు తులసిప్రసాద్, ఉపాధ్యక్షులు నరసింహరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యం పూర్వం నుండి హక్కులు కలిగి అనుభవంలో ఉండి ఇనాం అబాలిషన్ చట్టం ద్వారా రద్దుకాబడి తిరిగి 1963లో పట్టాలు పొందినట్లు తెలిపారు. మేము మా పూర్వికులు 1974వ సంవత్సరంలో సెటిల్‌మెంట్ ఆఫీసర్ ఆ భూములను ప్రభుత్వ భూములుగా పేర్కొనడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ రికార్డులలో మార్పు చేయకపోవడం వల్ల ఎన్.ఓ.సిలు, తుడ అప్రూవల్ ఇవ్వటం మూలంగా అందరూ ఇండ్ల స్థలాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2008 నుండి రిజిస్ట్రేషన్స్ నిలిపివేయడం ద్వారా ప్రవేట్ వ్యక్తుల పేరుపైనే ఈ భూములన్నియూ రెవెన్యూ రికార్డులలో చూపిస్తూ వస్తున్న సందర్భంలో 2015లో ఎవ్వరిక నోటీసులు ఇవ్వకుండానే 22(ఎ) నిషేధిత జాభితాలో చేర్చారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రస్తుతం ఆ భూములు కొనుగోలు చేసిన మేము వృద్దాప్యంలో ఉన్నామని, పిల్లల చదువులకు, పెళ్లిళ్ల కొరకు, వ్యక్తిగత ఆరోగ్య సమస్యలు తదితర సమస్యలతో బాధపడుతున్నామని వాపోయారు. తమ ఇండ్ల ప్లాట్స్ నిషేధిత జాబితా నుండి తొలగించి, మా ప్లాట్స్‌కు విముక్తి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సంఘ సభ్యులు చలమారెడ్డి, చిన్నపరెడ్డి, ప్రభాకరరావు, నారాయణరావు, రామరాజు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## దామినేడులో ఇండ్ల స్థలాలు కేటాయించండి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి18 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ దామినేడు ప్రాంతంలో గత 16 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ట్రాన్స్ జెండర్స్ కమ్యూనిటీకి ఇండ్ల స్థలాలు కేటాయిం చాలని కోరారు. ఈ మేరకు మంగళవారం తిరు పతిరూరల్ తహశీల్దార్ రామాంజుల నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేసారు. దామినేడు ఇందిరమ్మ కాలనీలో గత 16 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాము...ప్రభుత్వం మమ్మల్ని గుర్తించలేదన్నారు. సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొంటూ, చులకనగా జీవనం సాగిస్తున్న తమ న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. దామినేడు లెక్క దాఖల సర్వేనెంబర్ 173, 174 సర్వే నెంబర్లలో వున్న ప్రభుత్వ భూమిలో తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీలేఖ, ప్రియ, పూర్ణ, శ్రీజ, సుభాషిణి. యమున, హేమ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పార్టీని విస్తరిద్దాం -బిజెపి అధ్యక్షుడు సామంచి

తిరుపతి(రవాణ),పిబ్రవరి 18ప్రభాతవార్త:



జిల్లాలో పార్టీని విస్తరించి, బిజెపి బలపడే అవకాశం తిరుపతి జిల్లాలో నిండుగా ఉందని ,రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంకావాలని జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్ష హోదాలో తొలిసారిగా బిజెపి నాయకులు, కార్య కర్తలతో సమావేశమయ్యారు. బిజెపి నాయకులు మధుకర్, భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, మునిసుబ్రమణ్యం,చంద్రప్ప, తదితరులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు.



## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల దృష్ట్యా మంగళవారం ఆలయంలో అంగరంగవైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాలను నిర్వహించారు.ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి కనబడింది. ఆలయం టిటిడికి అనుబంధంగా నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో వైష్ణవ సాంప్రదాయం మేరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అర్చకులు,అధికారులు ప్రజలు కలసి తిరుమంజనం కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆంజనేయ రాజు, టెంపుల్‌ఇన్స్పెక్టర్ రవిరెడ్డి, అర్చకులు సిహెచ్‌వి రమణాచార్యులు,బాబు, కృష్ణ,అజయ్‌కుమార్, గోపి, మాధవాచార్యులు సిబ్బంది పాల్గొన్నారు.



## జనసేలో చేరిన గ్రామస్తులు

తొట్టంబేడు,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలోని కాసరం పంచాయతీలో జనసేన నాయకునికి ఆశయాలు,లక్ష్యాలు నచ్చి పార్టీలో చేరినట్లు జనసేన ఇన్‌చార్జి వినూత కోట తెలిపారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మండలాల్లోంచి జనసేనలో చేరే వారు పెరుగుతున్నారని వినూత వివరించారు.జనసేన నాయకునికి పరిపాలనకు జనం ఆకర్షితులౌతున్నారని ఆమె వివరించారు. శ్రీకాళహస్తిలోని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తేవటంలో తాముచేస్తున్న కృషి ప్రజలకు నచ్చుతుందని ఆమె వివరించారు.కాసరం పంచాయతీ నుంచి 50 మంది పార్టీలో చేరినట్లు వివరించారు.శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి సభ్యత్వాన్ని అందించారు.ఈ కార్యక్రమాల్లో నాయకులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి!

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కాంగ్రెస్ ఐ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావటానికి ప్రతి కార్యకర్త చొరవ చూపాలని నియోజకవర్గ ఇన్‌చార్జి తలపాదామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పార్టీ ముఖ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా నేడు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.దేశంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్,ప్రియాంక గాంధీల చొరవను ఆదర్శంగా తీసుకొని కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈనెల 20న నియోజకవర్గ సమావేశం ఏర్పాటుకు జిల్లా పార్టీ అదేశించిందని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో కార్యదర్శి ఖలిందర్ జిల్లా పార్టీ మైనారిటి సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షుడు సురేంద్రరెడ్డి రేణిగుంట మండలంఅధ్యక్షుడురాహుల్ జోస్ రాయల్, ఆంటోని,నవీన్, సమీర్, వెంకటేష్, మునిరాజా పాల్గొన్నారు

## కొత్తూరు దళితులకు ఇంటి స్థలాలు చూపండి - సీపీఎం

**కేవీబీ పురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలం కొత్తూరు దళితులకు ఇంటి స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కొత్తూరు దళితులతో కలసి కేవీబీ పురం తహసీల్దార్ మునిరత్నంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లగా ఇంటి స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కూడా గత ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇస్తామని ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికి ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం మూడు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో పట్టాలు ఇవ్వాలని జీవో ఇచ్చినందున రెవెన్యూ అధికారులు కొత్తూరు దళితులకు మూడు సెంట్లు వంతున స్థలం చూపించి పట్టాలు ఇచ్చి పక్కా ఇల్లు కూడా మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ మునిరత్నంరెడ్డి మాట్లాడుతూ గ్రామ సమీపంలో సర్వే చేసి భూమి గుర్తించి పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, కొత్తూరు శాఖ కార్యదర్శి వరలక్ష్మి, దళిత కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## ఊపిరి ఉన్న వరకు ప్రజాసేవకే నా జీవితం అంకితం - ఎమ్మెల్యే

**కేవీబీ పురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవకే నా జీవితం అంకితం అని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. మండల కేంద్రంలోని నిర్వహించిన అధికారులు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే అధికారులకు తన మాటలతో చాలా కాలం తరువాత చురకలు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కేవీబీ పురం మండలానికి వచ్చిన నిధులపై, పనుల వివరాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగాఅధికారుల పనితీరుపై నిప్పులు చేరిగారు. ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో కూటమి నేతలు కార్యకర్తలు పాలు పంచుకోవాలని, ఆయా పనుల్లోస్థానిక నేతలు మాత్రమే కాకుండా కార్యకర్తలు కూడా పాల్గొనేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, పీఆర్, ఉపాధి, హౌసింగ్, ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తన పరిధిలోకి వచ్చే అన్ని సంక్షేమ కార్యక్రమాలు తనకు తెలిసే జరగాలని, ఆ రూపంలో ప్రతి కార్యకర్తకు మేలు జరిగేలా చూస్తానన్నారు. అనంతరం ఆయన కేవీబీ పురం గిరిజన కాలనీ, రాయ పేడు శ్మశాన దారి రోడ్డు నిర్మాణాలకు భూమిపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముని రత్నం, ఎంపీడీవో రాధారాణి, మాజీ ఎంపీపీ సుబ్రమ్మణ్యం, మల్లికార్జున్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలమంగళం రమేష్, అవసరం సురేష్‌రెడ్డి, రాయపేడు సర్పంచ్ బాలాజీ, మాజీ సర్పంచ్ చెంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీహరియాదవ్, ప్రవీణ్, కందస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యాశాఖ మంత్రిని కలసిన జయరాంరెడ్డి

**కేవీబీ పురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ని తిరుపతి పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు తెరణి జయరాంరెడ్డి మర్యాద పూర్వకంగా కలసిసమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా జయరాంరెడ్డి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులతో పాటు, పల్లె ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థినులకు సైకిళ్ళను పంపిణీ చేయాలని కోరారు. అలాగే కేవీబీ పురం మండలంలో జూనియర్ కళాశాలతో పాటు ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలను ఏర్పాట చేయాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పరిష్కారం చేయాలని కోరినట్టు ఆయన పేర్కొన్నారు. సంబంధిత విషయాలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన అన్నారు.



## పొగాకు వినియోగంతో క్యాన్సర్ ముప్పు

***తొట్టంబేడు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త*** జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి స్విమ్స్ ఆధ్వర్యంలో మండలంలోని చిట్టత్తూరు, శివనాథపాళెం గ్రామాల్లో మంగళవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను తొట్టంబేడు వైద్యాధికారి డాక్టర్ లహరిణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా విచారణ సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులను వినియోగించే వారికి నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు పొంచి ఉందని వెంటనే అలాంటి అలవాట్లు మానుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగంతంగా జరుగుతోందన్నారు. బిపి, షుగరు పరీక్షలతో పాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. నేడు కంచనపల్లిలోను, 20న కాసరం పిహెచ్‌సి పరిధిలోని చియ్యవరం, 22న ఇలగనూరు, గుండేలిగుంట,, 24న పెద్దకనపర్తి, పూడి గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సురేంద్రనాథ్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్యభాను,డాక్టర్ హరిత, సర్పంచ్‌లు ఆర్.కృష్ణమూర్తి, సుబ్రమణి, పంచాయతీ కార్యదర్శులు శాంతి, రోజా పిహెచ్ఎన్ సంపూర్ణమ్మ, సూపర్‌వైజర్ ధనమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు ఎం.నాగమ్మ, ఎం.భాగ్యశ్రీ, ఏఎన్ఎంలు మమత, రాధ, స్థానిక వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ట్రైనింగ్‌లో నేర్చుకున్న ప్రతి అంశాన్ని అంగన్‌వాడీలో అనుసరించాలి - ఎంఈవో

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ప్రతి అంగన్‌వాడీలు ట్రైనింగ్‌లో నేర్చుకున్న ప్రతి అంశాన్ని అంగన్‌వాడీల్లో అనుసరించాలని ఎంఈవో తిరుమలరాజు పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన 120 రోజుల జ్ఞానజ్యోతి ప్రోగ్రాంలో భాగంగా 6 రోజుల ట్రైనింగ్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, డైట్ లెక్చరర్ అనితలు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో తిరుమలరాజు మాట్లాడుతూ ఈ ట్రైనింగ్ యొక్క ఆవశ్యకత, నేర్చుకోవలసిన విషయాలు, సాల్ట్ ప్రోగ్రాం గురించి 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలను పాఠశాలకు ఎలా సంసిద్దులు చేయాలో తెలియజేశారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి, కేఆర్‌పీలు అనిత, డీఆర్‌పీలు రమేష్, వెంకటేష్, భూపతి, గీతాంజలి, సంధ్య, అనిత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఎస్వీయూకు వీసీని బీసీనే నియమించాలి

***తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :*** ఎస్వీయూనివర్శిటీకి వీసీని బీసీ కులానికి చెందిన ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని బీసీ సంఘర్షణ సమితి నేతలు అశోక్, లక్ష్మయ్య, ప్రభాకర్, రమణ, లక్ష్మయ్య యాదవ్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీలో బీసీలకు ప్రాధాన్యత ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 50 శాతం ఉన్న బీసీకు సీఎం నారా చంద్రబాబు నాయుడు చదువుకున్న ఎస్వీయూనివర్శిటీకి బీసీ కులానికి చెందిన ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని కోరారు.

## సోలార్ రూఫ్‌టాప్‌ని నిర్మించుకోండి : ఎంపీడీవో



***సత్యవేడు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:*** గృహ విద్యుత్ వినియోగదారులందరూ సోలార్ రూఫ్ టాప్‌ని నిర్మించుకోవాలని తిరుపతి జిల్లా సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవన కార్యాలయంలో వెలుగు ఏపీఎం డాంగేయాదవ్ అధ్యక్షతన సంఘమిత్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంలో సోలార్ రూఫ్‌టాప్‌ని నిర్మించుకోవచ్చునని అన్నారు. వీటిని ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఒక కిలో వాట్ సోలార్ రూఫ్‌టాప్‌కు 30 వేలు, రెండు కిలో వాట్‌కు 60 వేల రూపాయలు, 3 కిలో వాట్‌కు 78వేలు ఈ పథకంలో సబ్సిడీ ఉంటుందని ఆయన వివరించారు. ఇంటి పై కప్పులో సోలార్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ బిల్లులు కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. ఎంఈవో రవి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించాలన్నారు. అలాగే పాఠశాలలో పిల్లల హాజరు 70 శాతం ఉంటేనే తల్లికి వందనం పథకం వర్తిస్తుందన్నారు. ఉపాధి ఏపీవో కృష్ణయ్య మాట్లాడుతూ ఇంట్లోనే వ్యర్థ జలాలను రోడ్లపైకి వదిలేయకుండాఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని కోరారు. ఇంకుడు గుంత నిర్మాణానికి రూ.5500లు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో వెలుగు కో-ఆర్డినేటర్లు పయని, శివకుమార్, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటేశ్వరి, అకౌంటెంట్ కాంచన, పలువురు సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ఎప్పటికప్పుడు చెత్త కుప్పలను తొలగించండి

**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**



నగరంలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం 22వ వార్డులోని ఎల్ఎస్ నగర్, తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అలాగే ఎమ్మార్ పల్లి వద్ద గల అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. చాముండేశ్వరి ఆలయం సమీపంలోని ఫ్లై ఓవర్ వద్ద చెత్త కుప్పలు ఉండడంతో వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లపైన, కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని అన్నారు. ప్రతి ఇంటికి ఆటో వెళ్లి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ బాగా చేయాలని అన్నారు. ఎమ్మార్ పల్లి వద్ద గల అన్నా క్యాంటీను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ. మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి బాలాజి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

**నాగలాపురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** నాగలాపురం మండలం వినోభానగర్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాలు ఇలా...నాగలాపురం దళితవాడకు చెందిన వ్యక్తి రామచంద్రన్ తన బైకులో కృష్ణాపురం నుంచి నాగలాపురం వస్తుండగా తిరుపతి వైపు వెళుతున్న కారు బైక్‌ని ఢీకొనడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రామచంద్రన్‌కి తీవ్ర గాయాలైంది. ఇది గమనించిన స్థానికులు హుటిహుటిన నాగలాపురం పీహెచ్‌సీ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం డా. తిరుపతి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న నాగలాపురం సబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్ తెలిపారు.

## విశ్రాంతి తీసుకుంటున్న కుట్టియమ్మకు రోజా పరామర్శ

విజయపురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:



మండలంలోని పన్నూరు దళితవాడలో వైసీపీ పార్టీకి చెందిన వార్డు సభ్యురాలు కుట్టియమ్మ ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మాజీ మంత్రి రోజా స్వయంగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవల పెళ్లైన ఇద్దరు కొత్త దంపతుల ఇళ్ళ వద్దకు వెళ్లి వారిని ఆమె ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శివరాజు, పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళియంబాకంలో టీబీపై అవగాహన సదస్సు

***విజయపురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:*** మండలంలోని కళియంబాకంలో మంగళవారం టీబీపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రీత్ సేఫ్ 360 టీబీ అలెర్ట్ ఇండియా వారి సహకారంతో నగరి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. గ్రామంలో 50 మందికి స్క్రీనింగ్ చేసి, టీబీ లక్షణాలు ఉన్న 10 మంది వద్ద స్పూటం శాంపిల్ కలెక్ట్ చేశారు. దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఛాతి నొప్పి వంటి లక్షణాలు టీబీ కావచ్చని అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సోమశేఖర్, విష్ణుప్రియ, సీహెచ్‌వో సుబ్బరామమ్మ, ఎస్ఐ బలరామయ్య, పీహెచ్ఎన్ భారతి, ఏఎస్ఐ గోవిందరాజులు, సర్పంచ్ విద్యా భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, ఎంపీహెచ్ఎస్ మురళి, శ్రీనివాస్, టీబీ సూపర్‌వైజర్లు అల్బర్ట్, పవన్, దేవి, ప్రియ, ఎంఎల్‌హెచ్‌పీలు సునీత,జీవ, హేమలత, గీత, ఏఎన్ఎంలు రేవతి, కుమారి, మునిభూషణ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.





## శివయ్యసేవలో వేమిరెడ్డి ప్రశాంతి

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎన్నో సదుపాయాలను సమకూర్చిన వేమిరెడ్డి ఽకుటుంబ సభ్యులు నిత్యశివ భక్తులుగా ఉన్నారు. గతంలో శ్రీకాళహస్తీశ్వరాల యానికి ఏది కావాలన్నా అందించారు. ముఖ్యంగా ఉత్సవ వాహనాలను బంగారుమయం చేయించిన ఘనత వేమిరెడ్డి కుటుంబానిదే.ఈ నేపథ్యంలో మంగళవారం కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. ఆమెకు దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి,డెప్యూటీ ఇవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ప్రోటోకాల్ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డిలు ఏర్పాట్లు చేసారు. దర్శనానంతరం ఆమెకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అమ్మవారి శేష వస్త్రాలను అందించారు.

## నరసింహస్వామికి ప్రత్యేకాభిషేకాలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

కైలాసగిరుల్లోని భక్తకన్నప్ప కొండపై వెలసిన లక్ష్మీనరసిం హస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయం లో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.ఈ కార్యక్ర మాలకు మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మాణంలో గతంలో శ్రీనివాసులు చొరవ చూపారు. ఈ నేపధ్యంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా అభిషేకాలకు శ్రీనివాసులుతోపాటు ఆయన అనుచరులు వేలూరు రమేష్,మునికుమార్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

తొట్టంబేడు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి దంపతుల ప్రథమపుత్రిక బొజ్జల అనికారెడ్డి జన్మదిన వేడుకలును శ్రీకాళహస్తీశ్వరస్వామి పాలక మండలి మాజీ సభ్యులు కాసరం రమేష్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థినీ విద్యార్థులచే అంగరంగ వైభవంగా కేక్‌కట్ చేసి, చాక్లెట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ ధర్మకర్త మండలి ఛైర్మన్ వాకచర్ల గుర్రప్పశెట్టి, టౌన్‌బ్యాంకు ఛైర్మన్ డివి.నారాయణ, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ డిల్లీబాబు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్‌జిలానీ, రాకేష్, వివేక్, మహేష్, నవీన్, తుమ్మబాల, కొండా సతీష్, మండల యాదగిరి, కుమార్, ధన తదితరులు పాల్గొన్నారు.

## ఆటో ధ్వంసం

తొట్టంబేడు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



మండలంలోని బోనుపల్లి దళితవాడలో నివాసం ఉంటున్న మస్తాన్, అమరావతి దంపతులకు చెందిన కొత్త ఆటోను అదే గ్రామానికి చెందిన లక్ష్మిపతి, ఉదయ్ కుమార్‌లు ధ్వంసం చేసినట్లు బాధితులు తెలిపారు. భూవివాదంతో తమపై దాడి చేశారని తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు తొట్టంబేడు పోలీసులకు పిర్యాదు చేశారు.

## పల్లెల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు



డక్కిలి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : డక్కిలి మండలంలోని అన్నీ గ్రామాలలో మౌళిక వసతులు కల్పించడంలో భాగంగా సిమెంట్ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ మండలానికి రూ. 2.65 కోట్లు జాతీయ ఉపాధి హామీ కింద నిధులు మంజూరైయ్యాయి. 27 పంచాయతీల్లో అన్నీ గ్రామాలలో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారు. ఈ పనులు నిర్మాణాల్లో ఎస్సీ,ఎస్టీ కాలనీలకు ప్రాధ్యాన్యత కల్పించారు. ఇప్పటికే దాదాపు 60శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు ఈనెలాఖరులోగా పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

## తాజుద్దీన్ సేవలు స్ఫూర్తిదాయకం



గూడూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఛైర్మన్, ఫౌండర్ డాక్టర్ తాజుద్దీన్ సేవలు స్ఫూర్తిదాయకమని బార్ అసోసియేషన్ అధ్యక్షులు పసుపులేటి భాస్కర రావు అన్నారు. గూడూరు పట్టణంలోని కుమ్మర వీధిలో ఉన్న ఆయన కార్యాలయంలో డాక్టర్ తాజుద్దీన్ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ నాన్న సయ్యద్ దస్తగిరి సాహెబ్ అనేక ఏళ్లుగా పరిచయం ఉందన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరుతో సంస్థను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రముఖ పాన్ బ్రోకర్ వ్యాపారవేత్త లక్ష్మి నరసింహ స్వామి అనంతరం బార్ లాయర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాజుద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పసుపులేటి భాస్కరరావు, నందిమండలం ఆబ్బిరాజు, మనోజ్ కుమార్, అల్లి భాస్కర్ రావు, దగ్గోలు వంశీ, పట్నం శ్రీనివాసులు, పసుపులేటి కార్తీక్, చైతన్య, పి. శార్వాణి, గోవింద నాయక్, షేక్ జీలానీబాష, షేక్ రషీద్ ఎస్కె ఆరీఫ్, లక్ష్మి నరసింహస్వామి, నియామతుల్లా, బర్కతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి అంగన్వాడీ ఇంటర్వ్యూలు

వెంకటగిరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : అంగన్వాడీ వర్కర్లు, ఆయాల పోస్టుల ఇంటర్వ్యూలో ఈ నెల 19వ తేదీ గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతాయని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. రెండు అంగన్వాడి కార్యకర్తలు, 11 అంగన్వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు పదో తరగతి పాస్ అయిన సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, ఎమ్మార్వో ఇచ్చిన నేటి వేటి సర్టిఫికేట్, ఆధార్ కార్డు స్టడీ సర్టిఫికెట్లు తీసుకొని ఇంటర్ వాళ్లకు హాజరు కావాలని కోరారు. 41 మంది దరఖాస్తు చేసుకోగా 35 మంది అందుకే కాల్ లెటర్స్ పంపేయమని తెలిపారు.

## దేశ వ్యాప్తంగా పొదుపు సంఘాలు



కోట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : భారతదేశ వ్యాప్తంగా పొదుపు సంఘాలను బలోపేతం చేసేందుకు కేంద్రప్రభుత్వం నూతన విధానాలను తీసుకొస్తుందని కడపకు చెందిన రిసోర్స్ పర్సన్లు భాగ్యలక్ష్మి, సరళలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐకెపి కార్యాలయంలో లోకోస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పొదుపు సంఘాన్ని సభ్యురాలు డేటాను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు లోకోస్ యాప్ కింద అన్ని సంఘాలను ఒకేతాటిపైకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పొదుపులక్ష్మి గ్రూపులను ఇతర రాష్ట్రాల్లో కూడా కేంద్రప్రభుత్వం అమలు చేసే దిశగా చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం అనిల, సిసిలు ప్రసాద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జిబిఎస్‌పై ఆందోళన వద్దు

కోట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : గులియన్ బారి సిండ్రోమ్ (జిబిఎస్)తో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కోట మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూపా అన్నారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జిబిఎస్ అనేది ఎవరికీ లేదన్నారు. వ్యాధి సోకే రెండు వారాల ముందు జలుబు, జ్వరం, వాంతులు, విరేచనాలు వంటివి వస్తాయని, అనంతరం రోగ నిరోధక శక్తి తగ్గుతు ఒదన్నారు. ఇది నరాల కణాలను దెబ్బతీసే చుట్టూ ఉండే మెలయిన్ పొరను ధ్వంసం చేయడం ద్వారా కాళ్లు చేతులు చచ్చుబడిపోవడం వంటి సమస్యలు నెలకొంటాయన్నారు. ఊపిరితిత్తుల సమస్యలు, ఆహారం మింగలేకపోవడం, చేతులు పైకి ఎత్తలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. చికున్ గున్యా వంటి వాటి వలన జిబిఎస్ వచ్చిందని పలువురు అనుమానిస్తున్నారని చెప్పారు. మంచి పోషకాహారం, ఎక్కువగా మంచినీరు తీసుకోవాలని సూచించారు.

## విలీనం రద్దు చేయాలంటూ ఆందోళన

కోట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : కోటలోని నార్త్ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అధికార పార్టీ ఎంపిటిసి సభ్యులు దారా సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. స్థానిక తహాశీల్దార్ కె.జయ జయరావుకు, ఎంఇఓ మస్తానయ్యకు, ఎంపిడిఓ వేణుకు వినతిపత్రం అందజేశారు.

# గూడూరు డివిజన్

## కేంద్ర బడ్జెట్‌పై కరపత్రాలు ఆవిష్కరణ



గూడూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం సి.పి.ఎం, సి.పి.ఐ వామపక్ష నాయకులు ఆధ్వర్యంలో దేశాన్ని ప్రజలను కొల్లగొట్టే కేంద్ర బడ్జెట్ సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. నాయకులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కాకులను కొట్టి గద్దలకు పెట్టడం అనేది ప్రజలు వింటున్నారని, ఇప్పుడు ప్రత్యక్షంగా అర్థం కావాలంటే 2025-2026 ఆర్థిక సంవత్సరానికి నిర్మలా సీతారామన్ గారు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ తాజా ఉదాహరణ అని సామాన్యులను కొల్లగొట్టి కార్పరేట్ శక్తులకు సంపదను సమర్పించుకునే బడ్జెట్ అని వారు తెలియజేశారు. గత నాలుగేళ్లుగా విశాఖ ఉక్కు పై పోరాడుతున్నా ఆ ఊసే ఈ బడ్జెట్ లో లేదని, పోలవరం, రాజధాని, మెట్రో రైలు, రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ఏ హామీకి పూర్తిస్థాయిలో కేటాయింపులు లేకపోవడం దురదృష్టకర మని, ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచారని, మూడేళ్ల కాలంలో పెద్ద కార్పొరేట్ కంపెనీలు 12 లక్షల కోట్లు రూపాయలు ఎగనామం పెట్టడం జరిగిందన్నారు. ఈ నెల 20వ తేదీన పాత బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామ పక్షాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమ జరుగుతుందని, ప్రజాసంఘాలు, సానుభూతిపరులు, అభిమానులు, రైతులు కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వామ పక్ష నాయకులు జోగి. శివకుమార్, టి.వెంకటరామిరెడ్డి, బి.వి.రమణయ్య, యస్.సురేష్, ఎస్.కె. కాలేషా, జి.శశికుమార్, ఎంబేటి చంద్రయ్య, అడపాల ప్రసాద్, కె.డేవిడ్,బి.మోసే, డి.ప్రసన్న, బి.మహేంద్ర, ముత్యాలయ్య, ఏలీయా, సురేష్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులకు అవగాహన



వెంకటగిరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : గురుకుల పాఠశాల (బాలికలు) ప్రకృతి వైపరీత్యాల గురించి తొమ్మిదవ ప్రత్యేక హోల్స్ బెటాలియన్ ఆర్ డి ఎఫ్ బృందం వివరించారు. అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆర్డీఎఫ్ బృందాలు వచ్చి సహాయక చర్యలు చేర్పడతాయని తెలిపారు. విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్ కన్నా, ఆర్ఐ ఎన్ ఎస్ ఎన్ శెట్టి, ఆర్ఎస్ఐ ప్రశాంత్, ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో హెచ్ఎం రజని, ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మార్చి 8న జరిగే లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

గూడూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. ఆమె మాట్లాడుతూ కక్షిదారులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని తమ కేసులను రాజీ చేసుకోవాలని, గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని,ఇందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి బి. రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బివి సులోచనా రాణి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.శంకరయ్య, డి.ఎస్.పి గీతా కుమారి, సీనియర్ ఏపీపీ లక్ష్మినారాయణ, బార్ ప్రెసిడెంట్ భాస్కరరావు, లాయర్లు కోటేశ్వరరావు, ఎస్కె మహబూబ్ బాషా, పోలీసు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## మేనకూరులో అనుమానాస్పదంగా యువకుడు మృతి!



నాయుడుపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని మేనకూరు గ్రామంలో అక్కుపల్లి సాయి(24)అనే యువకుడు అనుమా నాస్పదంగా మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. పోలీసుల సమాచారం మెరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాళహస్తికి చెందిన సాయి గతకొంత కాలంగా మేనకూరు సమీపంలో ఉన్న ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం కంపెనీలో ఏమి జరిగిందో ఏమో తెలియదు గాని, మేనకూరులో అతను ఉంటున్న రూమ్‌లో ప్యానుకు ఉరివేసుకొని మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలిపారు. విషయం తెలుసుకొన్న నాయుడుపేట సిఐ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలంకు చేరుకొని సాయి మృతదేహన్ని పరిశీలించారు. అనంతరం పంచనామ నిమిత్తం మృతదేహన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## పరిసరాల పరిశుభ్రతతో మంచి ఆరోగ్యం



కోట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని కోట మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూపా అన్నారు. మంగళవారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ప్లాస్టిక్‌ను కనుచూపు మేరలో లేకుండా అందరూ కలిసికట్టుగా తరిమివేయాలన్నారు. తడి-పొడి చెత్త వేరు చేసి ప్లాస్టిక్ డబ్బాల్లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు డోమా ప్రియరావు, శరత్, పృధ్వి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 20న మెగా రక్తదాన శిబిరం



కోట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మన మధ్య లేకపోయినా.. నేదురుమల్లి ఫౌండేషన్ ద్వారా ప్రతి ఒక్కరి గుండెల్లో సజీవంగా ఉన్నారని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక మంచిపని ప్రారంభించడంతో పాటు దాన్ని కొనసాగించడం చాలా కష్టమని, అలాంటిది నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నిరంతరాయంగా సేవలు చేయడం గొప్ప విషయమన్నారు. జనార్ధన్‌రెడ్డి 90వ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 20న విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామరెడ్డి కళాభవన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. గత 2018 నుంచి 2024 వరకు అత్యధికంగా రక్తం సేకరించి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచినందుకు గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. నేదురుమల్లి ఫౌండేషన్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, వెంకటగిరిలో అంబులెన్స్ సౌకర్యం, వాకాడులో తాగునీటి సౌకర్యం, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు రాయితీ సౌకర్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. సైన్స్ అండ్ హుమానిటీస్ విభాధిపతి డాక్టర్ చింతా రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

## కారు బైక్ ఢీ ఇద్దరు విద్యార్థులు మృతి



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ఆర్ఆర్ నగర్ వద్ద మంగళవారం రాత్రి కారు బైక్‌ని ఢీ కొన్న ఘటనలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. బంగారుపాళ్యం మండల కేంద్రంలోని తగ్గువారిపల్లి పంచాయతీ, సాయినగర్‌కు చెందిన బాబు కుమారుడు ఉమాపతి(16) స్థానిక విజేత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు, కరిడివారిపల్లి గ్రామానికి చెందిన హేమశేఖర్ కుమారుడు గౌతమ్ ఇద్దరూ బైక్‌పై వస్తుండగా కారు ఢీ కొన్నది. ప్రమాదంలో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందడంతో, మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్త ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసు శాఖకు 'జెన్నీ' టాటా

### - పోలీసు శునకం జెన్నీ పదవి విరమణ- ఘనంగా సన్మానించిన ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: పోలీసు శాఖకు పదకొండు సంవత్సరాల పాటు విశేష సేవలు అందించిన పోలీసు శునకం జెన్నీ మంగళవారం పదవి విరమణ పొందింది. చిత్తూరు నగరంలోని సాయుధ దళం కార్యాలయంలో మంగళవారం పోలీసు శునకం జెన్నీ పదవి విరమణ కార్యక్రమానికి ఎస్పీ మణికంఠ చందోలు ముఖ్య అతిధిగా హాజరై పదవి విరమణ పొందిన జెన్నీ శునకంను పూలమాల వేసి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖకు శునకం జెన్నీ చేసిన సేవలను ఎస్పీ మణికంఠ చందోలు మరువలేనివని కొనియాడారు. పలు కేసుల దర్యాప్తులో శునకం జెన్నీ సహకారం పోలీసు శాఖ ఎన్నటికి మరువలేనిదన్నారు. జెన్నీ శునకం 15 నవంబర్ 2015న జన్మించిన గోల్డెన్ రిట్రైవర్ జాతి శునకం(స్నిఫ్ఫెర్ డాగ్). ఈ పోలీసు శునకం హ్యాండ్లర్ పేరు బి.శ్రీనివాసులు. జెన్నీ శునకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మొయినాబాద్ నందు ఎక్స్‌ప్లోజివ్ విభాగం నందు 8 నెలల కఠిన శిక్షణ పొందింది. జెన్నీ శునకం విఐపి, వివిఐపి కార్యక్రమాల్లో మెరుగ్గా సేవలు అందించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముఖ్యమైన దేవాలయాలైన తిరుమల, కాణిపాకం బ్రహ్మోత్సవాలు, గోదావరి పుష్కరాల సమయంలో సంఘ విద్రోహ చర్యల నివారణ కోసం పోలీసు శాఖ జెన్నీ సేవలను వినియోగించుకునేది. పోలీసు శాఖ చేధించిన పలు కీలక కేసుల్లో శునకం జెన్నీ సహకరించేది. అలాగే ఎపోలీసు విధుల్లో ముఖ్యమైన ఎన్నికల్లో సైతం శునకం జెన్నీ చురుగ్గా పాల్గొనేది. ప్రపంచ నౌకాదళ రోజు సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన ఎఎస్‌సి విధుల్లో జెన్నీ తన ప్రతిభను కనబరచింది. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిఎస్పీ టి.సాయినాథ్, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ భాస్కర్, ఆర్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అడవిలోకి చొరబడుతున్న వ్యక్తి అరెస్ట్

### - 27 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : కడప జిల్లా ఉద్దిమడుగు అటవీ ప్రాంతంలో చొరబడుతున్న కొందరు వ్యక్తులను అడ్డుకున్న రెడ్ శాండర్స్ టాస్క్‌ఫోర్స్ ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, 27 ఎర్రచందనం దుంగలతో ఒక మోటారు సైకిల్ ను స్వాధీనం చేసుకుంది. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు సూచనలు మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జి.బాలిరెడ్డి మార్గనిర్దేశకత్వంలో ఆర్ ఐ (ఆపరేషన్స్) చిరంజీవికి చెందిన ఆర్ ఎస్ ఐ మురళీధర్ టీమ్, కడప జిల్లా ఉద్దిమడుగు అటవీ ప్రాంతంలో స్థానిక అటవీ శాఖ అధికారులు పి. ఇందిర, జి. కిషోర్ కుమార్‌లతో కలసి కూంబింగ్ చేపట్టారు. వీరు ఉద్దిమడుగు వైపు గల ఎర్రచందనము ఎంట్రీ, ఎగ్జిట్, డంపింగ్, లోడింగ్ పాయ్సింట్లను తనిఖీ చేసుకొంటూ వెళ్ళుచుండగా, భాకరాపేట ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో జామాయిల్ ప్లాంటేషన్ వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందన మొద్దులను మోసుకుని వెళుతూ కనిపించారు. వీరిని టాస్క్ ఫోర్స్ టీమ్ చుట్టుముట్టే ప్రయత్నం చేయగా వారు పారి పోయారు. వారిని వెంబడించినన టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఒకరిని అరెస్టు చేశారు. ఆ ప్రాంతంలో 27 ఎర్రచందనం దుంగలు, మోటార్ సైకిల్ స్వాదీనం చేసుకున్నారు. పారిపోయిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎస్ ఐ రఫీ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శివయ్య సన్నిధిలో ప్రధాన కార్యదర్శి పరిశీలనలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయ్‌చంద్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, తిరుపతి ఆర్‌జెసి ఆజాద్‌లు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఇప్పటి వరకు అధికారులు చేపట్టిన ఏర్పాట్లును గురించి ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి వివరించారు. క్యూలైన్లు,లైటింంగ్ సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఉన్నతాధికారులకు వివరించారు. అలాగే దక్షిణ గోపురం నుంచి వారికి వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయంలోపల క్యూలైన్లను బయటకు వెళ్ళ మార్గాలను ఉన్నతాధికారులు పరిశీలించారు. ఎక్కడ జనం ఎక్కువ వత్తిడికి గురౌతారు. నిలబడిపోతారు అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గతంలో ఇక్కడ ఇఓగా బాధ్యతలు నిర్వహించిన తిరుపతి ఆర్‌జెసి ఆజాద్ కీలక అంశాలను వివరించారు. ఉత్సవాలకు సంబంధించి జాగ్రత్తలను వివరించారు. వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించగా ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి వారికి శేష వస్త్రాలను అందించారు. వారితో పాటు డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డి, ఏఇఓలు లోకేష్‌రెడ్డి, ప్రోటోకాల్ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎఇఇ కిషోర్ ఉన్నారు.

## ఏడు నెలలుగా... వేతన వెతలే...!

### -ఏ నెలలోనూ ఒకటో తారీఖు జీతాలు ఇవ్వలేదు -నేటి సాయంత్రం వరకు గడువు నిచ్చిన ఉద్యోగులు -నాన్ టీచింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏడీ బిల్డింగ్ వద్ద నిరసనలు



తిరుపతి విద్య, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : ఎస్వీయూలో వేతన జీవుల సహనం నసించింది. జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఆగ్రహజ్వాలలు తారాస్థాయికి చేరుకున్నాయి. దీంతో పిడికిలి బిగించి కదం తొక్కనున్నారు. గత ఏడు నెలలుగా ఏ నెలలోనూ ఒకటో తారీఖున జీతాలు అందకపోవడంతో వేచిచూసిన ఉద్యోగులు జనవరి మాసం జీతాలు ఇంతవరకు అందకపోవడంపై పలు మార్లు అధికారులకు, ప్రభుత్వానికి విన్నవించారు. అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో పోరుబాటలో నడిచేందుకు సన్నద్ధమవుతున్నారు.

## ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలన

తిరుపతి విద్య ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బుధవారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఇండోర్ స్టేడియంతోపాటు ఆడిటోరియంలోని ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తో కలిసి శాప్ ఛైర్మన్ రవినాయుడు మంగళవారం పరిశీలించారు. ప్రారంభోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని శాప్ ఛైర్మన్ రవినాయుడు కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఉమా, రిజిస్ట్రార్ ఎన్.రజనీ, పీఈడీ ఎస్.సరోజినీ, డీఎస్డీఓ సయ్యద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

### గోవిందుని దర్శనం నిర్వహణ...

## అమలు వ్యవస్థ పటిష్టం

### -సామాన్యభక్తుల దర్శనాలకే అధికసమయం
### -ఆలయ కన్వెన్షన్ ఎక్స్‌పోలో టిటిడి అదనపు ఈఓవెంకయ్యచౌదరి



తిరుమల, ఫిబ్రవరి 18ప్రభాతవార్తప్రతినిధి: దేశవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని విస్తృతంగా తీసుకెళ్ళేందుకు అన్నమాచార్య, దాస్య సాహిత్యం, ఆళ్వార్‌దివ్య ప్రబంధం,హిందే ధర్మప్రచార, ఇతర ప్రాజెక్టులు ద్వారా ముందుకు తీసుకెళుతున్నామని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. దేశంలోని అన్ని దేవాలయాలకు తిరుమల ఆలయం నిర్వహణ ఆదర్శమని ఆయన తెలిపారు. తిరుపతిలో జరుగుతున్న ఆలయ కన్వెన్షన్ ఎక్స్‌పో (ఐటిసిఎక్స్)సదస్సులో రెండవరోజు మంగళవారం సాయంత్రం టిటిడి అదనపు ఈఓవెంకయ్యచౌదరి పాల్గొన్నారు. ఆలయాల నిర్వహణ, భక్తులకు దర్శనం చేయిస్తున్న తీరు, వసతి కల్పన భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, టిటిడి ఉద్యోగులు సిబ్బంది సేవలు ,వివిధ సంస్థలు,ట్రస్ట్‌లునిర్వహణగురించి స్పష్టంగా వివరించారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తున్నామని, ఇందుకు మూడు వంటశాలలు ఉన్నాయన్నారు. 14 ఆస్పత్రులు, డిస్పెన్సరీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుమలలో భక్తులకు ఉచిత ధర్మరథాలు రవాణా సదుపాయం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, వేదిక్‌వర్సిటీ ఉపకులపతి శ్రీరామసదాశివ మూర్తి, హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీరామరఘునాథ్, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, ఐటిసిఎక్స్ టెంపుల్‌కన్వెన్షన్ వ్యవస్థాపకుడు గిరీష్‌వాసుదేవ్‌కులకర్ణి, ఛైర్మన్‌ప్రసాద్‌లాడ్,తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఉమ

### -వర్సిటీకి వీసీగా పూర్తి స్థాయి భాధ్యతలు అప్పగిస్తూ నోటిఫికేషన్ -నేడు బాధ్యతల స్వీకరణ



తిరుపతి విద్య ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : అనుకున్నదే నిజమైంది. పద్మావతి మహిళా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఉమను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1983లో వర్సిటీలో అధ్యాపకురాలుగా ప్రస్తానవ కొనసాగించిన ఆమె 40ఏళ్లపాటు బోధన, పరిశోధన రంగాలలో పనిచేశారు. జాతీయ, అంతర్జాతీయ పబ్లికేషన్తో పాటు స్టేట్ బెస్ట్ టీచర్ ప్రశంసలు పొందారు. మహిళా వర్సిటీకి రెక్టార్, ఇన్చార్జి వీసీగా పనిచేసిన అమెకు వర్సిటీ పాలనపై అవగాహన ఉంది. మహిళా వర్సిటీ వీసీ పోస్టుకోసం వందల సంఖ్యలో ఆశావాలు ప్రయత్నాలను సాగించినప్పటికీ వీసీ పోస్టు ఆమెనే వరించింది. ప్రస్తుతం ఇంచార్జి వీసీగా కొనసాగుతున్న ఆమె బుధవారం పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధకారితే లక్ష్యంగా వర్సిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానాని చెప్పారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన ప్రభుత్వానికి ధన్యవాధాలు తెలిపారు.

## ఆకట్టుకుంటున్న శివయ్య విగ్రహం

### -నంది, భక్తకన్నప్ప విగ్రహాల వద్ద లైట్లు వేయాలి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలో ఈనెల 21 నుంచి జరిగే మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. దీంతో కొత్తరోడ్లతో పాటు ఏపిసీడ్స్ నుంచి రామసేతు వంతెన వరకు కొత్తగా డివైడర్ల మధ్యలో చక్కని వివిధ రూపాల్లో మొక్కలు ఏర్పాటు చేయడంతో పాటు స్వర్ణముఖినదిని ప్రక్షాళన చేశారు. ఇక పార్కింగ్‌కు వివిధ స్థలాలు కేటాయించిన సంగతి తెలిసిందే. వీఎంసి సర్కిల్ వద్ద ఉన్న శివయ్య విగ్రహం చుట్టు నీరు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇది ఎంతో ఆకట్టుకుం టోంది. ఇక బసవయ్యపాళెం సర్కిల్ వద్ద ఉన్న నంది సర్కిల్, ఎంజిఎం సర్కిల్ వద్ద ఉన్న భక్తకన్నప్ప విగ్రహం వద్ద లైట్లు వేయాల్సిన అవసరం ఉంది. దీనిపై ఎంఎల్ఏ బొజ్జలుసుధీర్‌రెడ్డితో పాటు విద్యుత్‌శాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

## నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి :జేసి

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్టు పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పీడీలు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సూళ్ళూరు పేట, శ్రీకాళహస్తి ఆర్డీవోలు కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి సంబంధింత మండలాల తహాశీల్దార్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్న కడప-రేణిగుంట, తిరుపతి-మదనపల్లి, రేణిగుంట- నాయుడుపేట ఆరు లైన్ల రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ వేగవంతం చేయాలని, రేణిగుంట నుంచి చెన్నై వరకు నాలుగు లైన్ల రహదారుల పనులు పూర్తి చేయాలని భూసేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. భూసేకరణ పెండింగ్ అవార్డులు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగర మాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకుని పనులు పూర్తి కావాలన్నారు. రైల్వే లైన్‌లో భాగంగా భూసేకరణకు సంబంధించిన పనులను సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానిఇకి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జెడ్ ఎం. విజయభరత్‌రెడ్డి, నేషనల్ హైవే పీడీలు తిరుపతి వెంకటేష్, నెల్లూరు ఎంకే చౌదరి, చెన్నై రవీంద్రరావు, డెప్యూటీ తహాశీల్దార్ భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.